# 1,116/- రూపాయలు బహుమతి పొందిన కథ




పెళ్ళి పందిరి సద్దుమణిగింది. పగలంతా పనిచేసి అలసిపోవడం వల్ల కబుర్లు చెప్పకుంటూ కూర్చున్న వాళ్ళు కూర్చున్నచోటే కునుకు పాట్లు పడుతున్నారు. ఉదయం ఆరు గంటలకి ముహూర్తం.

పచ్చని కొబ్బరాకుల పందిరి వెన్నెల కాంతిలో వింతగా మెరుస్తోంది. ఆడవాళ్ళు రాసుకున్న సెంట్లు, కొబ్బరాకుల వాసన కలగలిసి అదోర కమైన వాసన వస్తోంది. తెల్లని మేఘం ఆకాశంలో మెల్లగా కదిలిపోతుంటే చంద్రుడు దాగుడు మూతలాడుతున్నాడు.

నేను పల్లకీనే తదేకంగా చూస్తున్నాను. ఎంత అందంగా వుందో? తొందరగా తెల్లారిపోయి పెళ్ళయిపోతే బాగుణ్ణు. ఆ పల్లకీ ఎక్కాలంటే రేపు సాయంత్రం వరకూ ఆగాలి. నాకు నాల్గు రోజుల నుండీ చాలా సంతోషంగా వుంది–స్కూలు కెళ్ళక్కర్లేదని రాజ్యం అక్క పెళ్ళికి తోడపెళ్ళికూతురి నని అమ్మ బుగ్గలు సాగదీస్తూ చెప్పింది. పదిహేను రోజుల నుండీ ఇంట్లో ఒకటే హడావిడి. ఒకటే మిటి రకరకాల పిండి వంటలు చేసారు. మొన్న అక్కతోబాటు నాకూ నలుగుపిండి పెట్టి కుంకుడు కాయల పులుసు వేసి తల రుద్ది పొడుగు జడ వచ్చేలా జడ కుచ్చులు పెట్టి చామంతి పూలతో అలంకరించారు. బుగ్గన చుక్క పెట్టారు. చాలా సిగ్గేసింది. కాళ్ళకు పారాణి పెట్టారు. కొత్తగా కుట్టించిన పచ్చటి పట్టు పరికిణీ కట్టుకున్నాను. అందరూ "బాగున్నావు కామేశ్వరీ" అన్నారు.

పల్లకీకి కట్టిన రంగు రంగుల కాగితాలూ, చెమ్కీ దారాలు గాలికి ఊగుతుంటే వెంటనే వెళ్ళి కూర్చోవాలన్నంత ఆతృత కలుగుతోంది. నిన్న చిన్నన్నయ్య బూజులు పట్టి అస హ్యంగా వున్న పల్లకీని కూలీల చేత మోయించుకుని తీసుకొస్తుంటే నవ్వు వచ్చింది. కాని అప్పటికీ, ఇప్పటికీ ఎంత తేడా? ముందు దానిని శుభ్రంగా కడిగాడు. బాగా ఆరిన తరువాత రంగు కాగితాలు అంటించాడు. పాపం, రోజంతా శ్రమపడుతూనే వున్నాడు. నేను ముందు పట్టించుకోలేదు. అమ్మ అరిసెలు ఎక్కడ దాచిందో తెలియక తికమక పడుతూ వెతికే ప్రయత్నాలు చేస్తూ ఆ ఆలోచనల్లోనే వుండి అమ్మ చేత చివాట్లు తిని బయటికొచ్చి అప్పుడు చూసాను. ఆ క్షణం నుండీ నాకు ఏదీ గుర్తులేదు. అక్క ఒళ్ళో కూర్చుని ఆ పల్లకీలో ఊరేగబోయే క్షణం కోసం శరీరంలోని అణువణువూ తహతహ లాడిపోతోంది.

కాని నాకు ఎంతో కోపమొచ్చిన విషయం ఏమిటంటే అందరూ పల్లకీ ముందు నుండి వెడుతున్నారు తప్ప కన్నెత్తి చూడ్డంలేదు. నాకు చాలా ఆశ్చర్యం కూడా కలిగింది. నేను పల్లకీ దగ్గరే కూర్చుని వుండడం చూసి చిన్నన్నయ్య నవ్వి "నీ పెళ్ళికి ఇంకా మంచి పల్లకీ తెచ్చి దీని కన్నా బాగా తయారుచేస్తానులే" అన్నాడు. నేను సిగ్గుపడ్డాను. ఇప్పుడు నేను ఏడవ తరగతి చదువుతున్నాను. రాజ్యం అక్క అంత ఎప్పుడవుతానో తెలియదు. రామాలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామ కళ్యాణం చేసి సీతారాముల్ని పల్లకీలో ఊరేగిస్తారు. అంటే దేవుడితో సహా పెళ్ళి చేసుకున్న వాళ్ళందరూ పల్లకీలో ఊరేగుతారన్నమాట.

ఈ రోజు మధ్యాహ్నం మగపెళ్ళివారు బస్సు దిగారన్న వార్త తెలియగానే అందరూ హడావిడిగా పరుగెత్తారు. నాక్కూడా కాబోయే బావగార్ని చూడా

లనే వుందికాని నేను వెళ్ళిపోతే ఈ పల్లకీకి ఏమైనా అవుతుందేమో? ఎవరైనా పాడుచేస్తారేమో? అన్న భయంతో ఒక్క నిమిషంలో పెళ్ళి చూసి వచ్చేసాను. అక్కడ చాలా గందరగోళంగా వుంది. వచ్చిన వాళ్ళు రకరకాలుగా మాట్లాడుతున్నారు. మర్యాదలు సరిగ్గా జరగడం లేదంటున్నారు. ఇచ్చిన కాఫీ కషాయంలా వుందని ఒకరంటే చచ్చిన ఈగ వచ్చిందని ఇంకొకరంటున్నారు.

పల్లకీ దగ్గరకొచ్చి కూర్చుని వాళ్ళు ఎందుకలా ప్రవర్తిస్తున్నారు? అనుకున్నాను. చాలా కట్నం ఇచ్చారని వచ్చిన చుట్టాలందరూ చెప్పుకుంటున్నారు. నాకు వీళ్ళని చూస్తే ఒళ్ళు మండిపోతోంది. ఏమిటో గుసగుసలాడుకుంటారు. పెళ్ళంటే పల్లకీ ఎక్కి ఊరేగడం, కొత్త బట్టలేసుకోవడం, పిండి వంటలు తినడం కాదు. ఇంకేదో వుంది. అవును ఇప్పుడు గుర్తుకొస్తోంది. ఒకరోజు నాన్నగారు ఏవో కాగితాలు పట్టుకుని ప్రొద్దున్నే బయటికెళ్ళడం, సాయంత్రం తిరిగి రాగానే అమ్మ "అప్పు దొరికిందా? అంత కట్నం ఎలా ఇవ్వాలండీ?" అనడం– కళ్ళలో గిర్రున నీళ్ళు తిరగడం–నాన్నగారు నిరాశగా తల ఊపే వారు. అందరి మొహాల్లోనూ విచారం కనబడేది. అక్క పెళ్ళికీ డబ్బుకీ వున్న సంబంధం ఏమిటి?

నేను అయిదారు పెళ్ళిళ్ళు చూసాను. పెళ్ళికూతురూ–పెళ్ళి కొడుకూ మధుపర్కాలతో పీటల మీద కూర్చుంటే చూడ్డానికి భలేగా వుండేది. పెళ్ళికొడుకు లేచి పసుపు పచ్చ తాడుతో కట్టిన మంగళ సూత్రాన్ని పెళ్ళి కూతురి మెడలో కడుతుంటే దగ్గరగా వెళ్ళి మరీ చూసేదాన్ని. తలంబ్రాలు ఒకరి మీద ఒకరు చల్లుకుంటుంటే అన్ని ఆటలకన్నా మంచి ఆట అన్పించేది. ఇవన్నీ చూసిన తరువాత నాకూ సరదాగా పెళ్ళి చేసుకోవాలనిపించింది తప్ప ఇంత గొడవ వుంటుందనుకోలేదు.

తాంబూలాలు పుచ్చుకుంటున్నప్పుడు బోల్డు రూపాయల కట్టలు బేగ్‌లో పెట్టి నాన్నగారు వాళ్ళకివ్వడం నేను స్వయంగా చూసాను. కొట్టుకెళ్ళి ఏదైనా కొనుక్కున్నప్పుడు డబ్బులిస్తాం. ఇక్కడ ఏ వస్తువునీ కొనడం లేదుకదా? మరెందుకలా ఇచ్చారు?

నాకర్థమైందేమిటంటే నాకు తెలియనివి ఎన్నో వున్నాయి. అవన్నీ ఎప్పుడు తెలుసుకోవాలి? పల్లకీని అనుకుని అలాగే నిద్రపోయాను. తెల్లారకట్ట హడావిడికి మెలకువ వొచ్చింది. వర్షం పడుతోంది. కళ్ళు నలుపుకుంటూ లోపలికొచ్చి రాజ్యం అక్క పక్కలో పడుకున్నాను. అప్పుడు పల్లకీ సంగతి గుర్తులేదు.

* * *

పూర్తిగా తెల్లవారింది. అక్క వెక్కిళ్ళ చప్పుడుకి లేచి కూర్చున్నాను. భయం భయంగా హాలులోకొచ్చాను. అమ్మ నేల మీద పడుకుని వుంది. ఎప్పుడూ గంభీరంగా వుండే నాన్నగారు నిస్తేజంగా కళ్ళు మూసుకుని కూర్చున్నారు. అన్నయ్యలు కొయ్య బొమ్మల్లా నిలబడి వున్నారు. బంధువులు బట్టలు సర్దుకుంటున్నారు. ఎవరిని ఏం అడగాలో తెలియటలేదు. స్నాతకం పీటల మీద కూర్చునే ముందు కట్నంలో మిగిలిన పదివేలూ ఇవ్వవలసిన నాన్నగారు ఆ డబ్బు ఇవ్వలేక పోయారని బంధువుల గుసగుసల వల్ల నాకు తెలిసింది. నా మనస్సులో ఏదో అలజడి. బయటకొచ్చి చూసాను. తెల్లారుఝాము వానకి తడిసిపోయిన పల్లకీ–అంటించిన రంగు కాగితాల్నీ, చెమ్కీ దారాల్నీ కోల్పోయి నిజమైన రూపంలోకి వచ్చేసింది. దాని మీద నుండి బొట్లు బొట్లుగా పడుతున్న వాన చుక్కలకి అడ్డుగా చెయ్యి పెట్టాను. అవి ఆగడం లేదు. ఆ వర్షపు చుక్కలు అక్క కళ్ళలో నుండి జారిన కన్నీటి చుక్కల్లా వున్నాయి. నా మనసు మొగ్గ రేకులు విచ్చుకుంటున్నాయి. ఒక్కొక్క రేకు విచ్చుకుంటుంటే ముల్లు గుచ్చుకుంటున్న భావన కలుగుతోంది.

పలక మీద అక్షరాలు రాసుకోవాల్సిన వయస్సులో పల్లకీ ఎక్కాలన్న కోరిక సహజమేకానీ ఊహల పల్లకీ ఎక్కితే మాత్రం కింద పడిపోక తప్పదు. పలకమీద రాసుకున్న అక్షరాలు నుదుటి మీద బ్రహ్మ వ్రాసిన అక్షరాల కన్నా గొప్పవి.

